త్వరగా బాధ లేకుండా
ఆనెల బారి నుండి రక్షణకు
కార్నేషన్
కార్న్ కేప్
వాడండి.




పెద్ద ఆనెలకు, కార్నేషన్ కోలస్ కేప్స్ వాడండి

10 రోజులు ఉచితంగా
ఇంట్లోవాడి చూసుకోవచ్చు.
ఈ కూపను పోస్టులో పంపండి
ఈ సదుపాయం వినియోగించుకోండి.



మీకు ఇంటికి వస్తుంది
భారతదేశంలో ఎక్కడ
ఉన్నాసరే. 4 బ్యాండ్
ఆల్ వర్ల్డ్ శక్తివంతమైన
ట్రాన్సిస్టర్
2 సంవత్సరాల గేరంటీ
ఎగుమతి నాణ్యత



టెలి-నేషనల్

ధర : రు. 195/-
అమ్మకం పన్ను మొ॥వి కలుపుకుని

ఆమోదించకపోతే
డబ్బువాపసు చేయబడు
సొమ్ము వాపసు

ఉచితం రేడియో లైసెన్సు మరియు ప్రత్యేక బహుమతి

ఈ రోజే పోస్టుచేయండి

రు. 30/- డిస్కౌంట్ కూపను

ఎగుమతినాణ్యతగల టెలి-నేషనల్ ట్రాన్సిస్టర్‌ను దయచేసి నాకు వి.పి.పి. ద్వారా పంపించగోరెదను. ట్రాన్సిస్టర్ అందినమీదట పోస్టుమాన్‌కు నేను రు. 165/- చెల్లిస్తాను.

పేరు..........................
చిరునామా..........................
సంతకం

లిట్జ్ ఏజెన్సీస్ 2724, దర్యాగంజ్, పి.బి. నం. 7009
న్యూ ఢిల్లీ-110002

దయచేసి కూపనుతోపాటు ఇంగ్లీషులో మీ చిరునామా జతపరచండి.

"ఏమి టంత సీరియస్‌గా ఆలోచిస్తు న్నావ్? షావులోంచి సరుకు పట్టుకు పోయినా పట్టించుకునే స్థితిలో లేవే!" కుర్చీలో కూర్చుంటూ అడిగాడు గిరి.

చిడం వేలి వేళ్ళతో కనుబొమ్మల కింద రుద్దుకుంటూ తలెత్తి చూశాడు రఘురాం. ఒక నిముషం గడిచాక "అర్జంటుగా ఒక సేల్స్‌మెన్ కావాలి" అన్నాడు.

"ఇంతమంది నిరుద్యోగులున్న ఈ దేశంలో ఆఫ్టరాల్ ఒక కేండిడేట్ కోసం ఇంత ఆలోచించాలా! అనుభవం వున్నవాళ్ళు కావాలంటే, ఎక్కువ జీతం ఇస్తానను. పని చేస్తున్నషాపుని అర్థాంతరంగా వదలి అయిదు నిముషాల్లో వందమంది నీ ముందుంటారు" అన్నాడు గిరి కొత్తగా పెట్టిన మెడికల్ షాపును చూస్తూ.

"అది సరే, నమ్మకమైనవాడు కావాలి కదా."

"అవతలి వ్యక్తి వ్యక్తిత్వం దెబ్బతిన కుండా అతడి అవసరాలు ఆదుకుంటూ వుంటే అతనే నమ్మకస్తుడవుతాడు. అంతే కాని 'నేను నమ్మకస్తుడ్ని' అని పచ్చబొట్టు పొడిపించుకుని నీకు చూపిం చరు. పోనీ ఒక పని చెయ్. నీకు తెలిసిన షాపులో ఎవరికైనా ఆశపెట్టు. వెంటనే వచ్చేస్తాడు."

"జనార్దనం షాపులో పని చేస్తున్న వెంకటేశును రమ్మంటే మిత్రద్రోహం చేసినట్టవుతుందేమో? వస్తాడో? రాడో?"

"మొహమాటానికి పోతే వ్యాపారం చేయలేవు. మిత్రద్రోహం, భాతృద్రోహం అనుకుంటూ కూర్చుంటే వ్యాపారం సాగదు. ఏమీ సాధించలేవు. ఎవరి లాభం వాళ్ళు చూసుకోపోతే ఈరోజుల్లో పైకి రాలేరు!"

"సరేవద" అని షాపు కట్టేశాడు రఘురాం.

ఇద్దరూ కలసి జనార్దనం షాపుకు కాస్త దూరంలో నిలబడి వెంకటేశుకు కబురు పంపారు. విషయం తెలిశాక తనకు వచ్చే జీతానికి మరో ఏభై ఎక్కువచేర్చి చెప్పాడు వెంకటేశు. "మాకు బోనస్ కూడా ఇస్తారు సార్" అన్నాడు.

"అలాగే. నేను ఇంకో పాతిక ఎక్కువిస్తాను. నా దగ్గర చేరు" అన్నాడు రఘురాం.




"కుదరదు సార్! పాతిక కోసం ఆ సర్వీసంతా వదులుకోమంటారా ?"

"ఆఖరు మాట. యాభై ఇస్తాను. ఇంక బేరం లేదు. కొత్తగా పెట్టిన షాపు కాబట్టి నువ్వు సీనియర్‌వు అవుతావు" ఆశ పెట్టాడు.

అకస్మాత్తుగా వందరూపాయలు పెరిగే సరికి లొంగిపోయాడు. నాలుగైదురోజుల్లో చేరతానని చెప్పాడు.

గడువు ప్రకారం కాకుండా ముర్నాడే చేరిపోయినందుకు రఘురాం ఆనందించాడు. వెంకటేశు పనితనం, ఉత్సాహం బాగా నచ్చాయి. స్నేహం దెబ్బతినకుండా జనార్దనాన్ని కలిసి "ఈ రోజుల్లో వర్కర్స్‌ని నమ్మడానికి వీల్లేదు. నాకో సేల్స్‌మన్ కావాలని తెలిపి తనే వచ్చి అడిగాడు. 'అక్కడ చేస్తున్నావు కదా!' అన్నాను. 'మీ దగ్గర చేయాలని వుంది సార్!' అని ప్రాధేయపడ్డాడు అని చెప్పాడు.

జనార్దనం వూ కొట్టి వూరుకున్నాడు.

సంవత్సరం గడిచిపోయింది. బోనస్ గురించి వెంకటేశు అడిగితే "లాభాలు రాలేదు. వస్తే ఇద్దును. నేను నీకు ప్రామిస్ చేయలేదు" అన్నాడు రఘురాం.

వెంకటేశుకు ఏం మాట్లాడాలో పాలుపోలేదు. గొడవ పెట్టుకుంటే వుద్యోగం లోంచి తీసేస్తాడేమో? జీతంలో ఏభై రూపాయలు అబద్ధమాడానని తెలుస్తుందేమో? నని భయపడ్డాడు.

లాభాలు రాకపోడమేమిటి. వున్నవాళ్లు లేనివాళ్లు డబ్బు దగ్గర ఎన్ని అబద్ధాలాడతారో ఆ గిరిగారు వస్తారుగా అప్పుడే అడగొచ్చు అనుకున్నాడు.

నెల గడిచినా గిరి రాలేదు. నాలుగైదు సార్లు యజమానిని అడిగినా ప్రయోజనం లేకపోయింది. గిరి ఇంటిచుట్టూ తిరిగి తన గోడు చెప్పుకున్నాడు. "నేను మాట్లాడుతాములే" అని గిరి పంపేశాడు.

గిరి ఎదురుగా బోనస్ విషయం కదిపినపుడు "లాభాలు రాలేదని చెప్తే వినిపించడంలేదా! ఏమిటీ న్యూసెన్స్" అని కోపగించుకున్నాడు రఘురాం.

"లాభాలు రాకపోడమేమిటి సార్! పని చేస్తున్నవాడ్ని నాకు తెలీదా. మీరు చెప్పండి సార్. అప్పుడు బోనస్ ఇస్తానన్నారుగదండీ" అన్నాడు గిరివేపు తిరిగి.

"ఏమో! నాకు గుర్తులేదు" అన్నాడుగిరి.

"అయిందా. నేనేదో అబద్ధ మాడుతున్నట్టు నువ్వు సత్య హరిశ్చంద్రుడిలా మాట్లాడావుగా" రఘురాం అసహ్యించుకుంటున్నట్లుగా చూశాడు.

ఎవరో రావడంతో పనిలో లీనమయ్యాడు వెంకటేశు.

"నువ్వు చేర్పిన ఆ వర్కర్ ఓవర్‌టైం అడుగుతున్నాడు. శలవు రోజున పనిచేస్తే కాంపన్సేటరీ హాలిడే అంటున్నాడు. బోనస్ ఎంతిస్తారు సార్ అంటున్నాడు" ఫిర్యాదు చేస్తున్నట్టుగా చెప్పాడు అపరిచిత వ్యక్తి.

"మన దగ్గర పనిచేసే వాళ్లని మనం కనిపెట్టకపోతే ఎలా. ప్రతి చిన్న విషయం పట్టించుకోకూడదు. మనకు వచ్చేదాంట్లో కొస్త వాళ్ళకి ఇస్తే ఇంకా కష్టపడి పని చేస్తారు" అన్నాడు రఘురాం.




74 సం.గా అఖండ ఖ్యాతిగాంచిన
నారసింహాతేహ్యం
రిజిష్టర్డు ట్రేడ్‌మార్కు
అన్ని రకములైన (ముఖ్యముగా పురుషుల) బలహీనతలను పోగొట్టి రక్త వృద్ధిని, పుష్టిని కలిగించు వాజీకరము.
1 డబ్బా రు. 7—25 పోస్టేజి ప్రత్యేకము.
పి. సి. ఏ. అండ్ కో.,
పెరిదేపి 523273 [ప్రకాశం జిల్లా]
క్యాటలాగు ఉచితము. కోరినవారికి ఏజన్సీలు ఇవ్వబడును.

మూలశంకకు
త్వరగ
నమ్మకమైన
హెడన్సా
విరేచనముతో
చికిత్సను పొందండి
—శస్త్రచికిత్స
అవసరములేదు!

# సేల్స్ మేన్

"అంతే నంటావా! ఏం చేస్తాం. చట్టాలన్నీ లేబర్‌కి ఫర్‌గా వున్నాయి." అని వెళ్ళిపోయాడు ఆ వ్యక్తి.

ఈ సంభాషణ విన్న వెంకటేశుకి యజమాని పై సదభిప్రాయం ఏర్పడింది. నిజంగా లాభాలు రాలేదేమో అని బాధ పడ్డాడు.

రెండో ఏడు కూడా లాభాలు రాలేదని, నష్టంమీద వ్యాపారం సాగుతోందనిచెప్పాడు రఘురాం. ఇష్టం లేకపోతే మానెయ్య మన్నాడు.

"మానేస్తాను. రేపట్నుంచేమానేస్తాను. ఒకనెల జీతం, సర్వీసు పైసలు, రెండు సంవత్సరాలకి బోనస్ ఇప్పించండి. వెళ్ళిపోతాను."

"ఇవన్నీ ఏమిటి" అశ్చర్యంగా అడిగాడు.

మానెయ్యమని ముందు నోటీసు యివ్వలేదు కాబట్టి ఒక నెల జీతం ఇస్తారండి. ఏడాదికి ఒక నెల జీతం చొప్పున ఎన్నేళ్ళు చేస్తే అన్ని నెలల జీతాన్ని సర్వీసు పైసలుగా ఇస్తారు కదండీ అని వివరించాడు.

"రూల్స్ మాట్లాడుతున్నావు. జనార్దనం దగ్గిర చెప్పకుండా మానేశావు. అప్పుడు ఈ రూల్స్ లేవా ?"

"అన్నిచోట్లా వున్నాయండి, అయన అన్నిరూల్ ప్రకారమే ఇచ్చారండి. లాభాలు వచ్చాయని అందరికీ తెలుసు. మాకిచ్చే డబ్బులు దగ్గర వెనక్కి లాక్కుంటే ఎలాగండి."

"మీరు చెప్పినట్లు చేస్తే నెత్తిమీద చెంగేసుకోవాలి. సర్లే రేపు చూద్దాం."

ఆ రాత్రి జనార్దనాన్ని మరో ఇద్దర్ని కలిసి వెంకటేశు విషయం చెప్పాడు. వెంకటేశు అడిగినవన్నీ ఇవ్వాలని వాళ్ళు చెప్పినపుడు అనవసరంగా మంచి వర్కర్ని పోగొట్టుకున్నానని బాధ పడ్డాడు. బోనస్ ఇచ్చేసి వుద్యోగం మానవద్దని చెబితే మెక్కి కూర్చుంటాడేమోనని భయపడ్డాడు. కొత్తగా చేరేవాళ్ళతో జాగ్రత్తగా వుండాలని నిశ్చయించుకున్నాడు. ఇద్దరి పని ఒక్కడే చేసేవాడు. ఇప్పుడు ఇద్దర్ని వెతుక్కోవాలేమోననే ఆలోచనలో పడ్డాడు.

తెల్లవారింది.

మానెయ్యబోతున్నట్లుగా నెల రోజుల ముందు జనార్దనానికిచ్చిన నోటీసు చూపించాడు వెంకటేశు.

అది చూసి నిస్తుపోయి, జనం తెలివి మీరుతున్నారని విసుక్కున్నాడు.

నెల జీతం అదనంగా యివ్వకుండా, వచ్చేనెల పని చేయించుకుని ఆ తర్వాత మానెయ్యమంటే? అనొచ్చు కానీ బెడిసి కొట్టిన వ్యవహారం కనుక వీడు ఖరీదైన మందులు పట్టుకు పోతాడేమో? ఎందుకొచ్చిన గొడవ. సెటిల్ చేసి పంపేద్దాం అనుకున్నాడు.

డబ్బులెక్కపెట్టుకొని "వస్తాను సార్" అని షాపులోంచి బయటకు వచ్చాడు.

ఆనాడు అపరిచిత వ్యక్తితో రఘురాం అన్నమాటలు గుర్తు తెచ్చుకుని 'మనిషికో న్యాయం' నవ్వుకున్నాడు వెంకటేశు.

శ్రామికుడి రక్తమాంసాల్ని పీల్చి పిప్పి చేసి, ఇచ్చే జీతానికి నాల్గురెట్లు పని తీసుకునే పెట్టుబడి వర్గాల మనస్తత్వాం తెలిసిన వెంకటేశు రఘురాం విషయంలో బాధపడలేదు.

జీతం చాలటం లేదని జనార్దనం దగ్గిర మానివేసే తలపుతో వున్న వెంకటేశుకు రఘురాం నుంచి ఆఫర్ రావడం శుభ సూచకం అనిపించింది. వందరూపాయల జీతం పెరగడానికి సాయపడిన రఘురాంకి మనసులో కృతజ్ఞతలు తెలుపుకున్నాడు.

ఇదివరకు వుద్యోగంలో వున్నాను కాబట్టి ఆఫర్ వచ్చింది. ఇప్పుడు నిరుద్యోగిని. పిలిచి వుద్యోగం యిస్తారా! వెళ్ళి అడిగితే అక్కడెందుకు మానేసావు అని అడగరా ? విషయం చెబితే వుద్యోగంలోకి తీసుకుంటారా ? అన్న అనుమానాలు వెంకటేశు మనసులో వుదయించక పోలేదు.

కష్టపడి పని చేసేవాడికి ఎక్కడో ఒకచోట వుద్యోగం దొరక్కపోదు అన్న ధీమాతో ముందడుగు వేశాడు.

### గమనిక

గేయాలు పంపేవారు వాటితో తపాలా కార్డు జత పరచవలసి వుంటుంది. గేయాలు త్రిప్పి పంపబడవు. గేయాలు, కవితలు సాధ్యమైనంత క్లుప్తంగా వుండటం మంచిది —సం.